క్లుప్తంగా

మరమ్మతు చేపట్టాలి



నెల్లికుదురు : మండలంలోని రాజులకొత్తపల్లి చెరువు కట్ట మరమ్మతు పనులను వెంటనే చేపట్టాలని మాజీ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. రాజులకొత్తపల్లి చెరువు కట్టను మంగళవారం ఆమె సందర్శించారు. నాలుగేళ్లుగా చెరువు కట్ట మరమ్మతుకు నోచుకోలేదని రైతులు తెలియజేయడంతో వెంటనే అధికారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.

ద్విచక్రవాహనం చోరీ

డోర్నకల్ : స్థానిక బ్యాంక్ స్ట్రీట్‌లో ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు డోర్నకల్ సీఐ బి.రాజేష్ తెలిపారు. సుల్లూరుకు చెందిన లింగాల రాజేష్ గత నెల 31న తన బైక్‌ను బ్యాంక్ స్ట్రీట్‌లోని శ్రీవెంకటేశ్వర దంత వైద్యశాల ఎదురుగా నిలపగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

నల్లబెల్లం స్వాధీనం

మహబూబాబాద్ రూరల్ : మండలంలోని ముడుపుగల్ శివారులో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో అక్రమంగా తరలిస్తున్న నల్లబెల్లం, పటిక, గుడుంబాను స్వాధీనం చేసుకుని, కారును సీజ్ చేసి, ఒకరిపై కేసు నమోదు చేశామని మహబూబాబాద్ రూరల్ ఎస్సై వి.దీపిక మంగళవారం తెలిపారు. 50 కిలోల నల్లబెల్లం, 200 కిలోల పటిక, ఐదు లీటర్ల గుడుంబా లభ్యంకాగా స్వాధీనం చేసుకుని పీఎస్‌కు తరలించామని తెలిపారు. కేసముద్రం మండలం ముత్యాలమ్మ తండాకు చెందిన వాంకుడోత్ సుమన్‌పై కేసు నమోదు చేశామని ఆమె పేర్కొన్నారు.

కురవి : సీరోలు మండలం చింతపల్లి శివారు ధరావత్ తండాకు చెందిన దస్రూ తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 4 క్వింటాళ్ల నల్లబెల్లాన్ని సోమవారం రాత్రి పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ మంగళవారం తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గూడూరు : మండలంలోని కొల్లాపురం శివారు గంగదేవితండా సమీప పాకాల వాగు నీటిలో మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు. గోధుమ రంగు టీ షర్టు, నల్లరంగు పాయింట్ ధరించి ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. అనుమానాస్పద స్థితిలో కనిపిస్తున్న మృతదేహం వివరాలు తెలిస్తే సమాచారం అందించాలని ఎస్సై కోరారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

గార్ల : కడుపునొప్పి భరించలేక వివాహిత ఎలుకల మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన దేశ్యాతండాలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దేశ్యా తండాకు చెందిన చిట్టెమ్మకు గతనెల 30వ తేదీన తీవ్రమైన కడుపునొప్పి రావడంతో ఎలుకల మందు తాగింది. అనంతరం ఆమె వాంతులు చేసుకుంటుండగా గమనించిన భర్త వినోద్‌కుమార్ ఆమెను ఖమ్మంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున ఆమె మృతిచెందింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా తెలిపారు.

విద్యుదాఘాతంలో గేదె..



మరిపెడ రూరల్ : మండలంలోని పూసలతండాకు చెందిన రైతు భూక్య వెంకన్న తన పాడి గేదెలను మంగళవారం మేతకు తండా శివారులో వ్యవసాయ పొలంలో వదిలాడు. గేదెలు గడ్డి మేస్తున్న క్రమంలో 11కేవీ విద్యుత్ తీగ తెగిపడి ఉండగా తీగకు గేదె తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. మృత్యువాత పడిన గేదె విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని రైతు వెంకన్న బోరున విలపించాడు.

పలువురి రిమాండ్

కొత్తగూడ : అటవీ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌లో మొక్కలు ధ్వంసం చేసిన వారికి రిమాండ్ చేసినట్లు ఎఫ్ఆర్ఓ వజ్రహత్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని ముస్మి గ్రామానికి చెందిన ఐలబోయిన కాంతారావు, గట్టి రమేష్, సురేష్, కల్తి సురపాపయ్య, గొంది కృష్ణ, నర్సింగరావు, ఐలబోయిన లక్ష్మినారాయణ, నాగేంద్రబాబు మొక్కలు నరికి ధ్వంసం చేశారని పేర్కొన్నారు. వీరిపై ఫారెస్ట్ యాక్టు-1967 ప్రకారం కేసు నమోదు చేసి జిల్లా జడ్జి ఎదుట సోమవారం హాజరు పరచినట్లు వివరించారు. విచారించిన జడ్జి వీరికి 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

అద్దె భవనంలో గ్రంథాలయం

- శాశ్వత భవనం నిర్మించాలని పాఠకులు, విద్యార్థుల వేడుకోలు

కురవి : మండల కేంద్రంలో గ్రంథాలయానికి శాశ్వత భవనాన్ని నిర్మించాలని పాఠకులు విద్యావంతులు, యువకులు కోరుతున్నారు. శాఖ గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించాలని మొరపెట్టుకున్నా పట్టించుకున్న నాథుడే లేరని వాపోతున్నారు. గతంలో మాజీ మంత్రి, డోర్నకల్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ కురవిలో గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు. నిధులు కేటాయించగా స్థలం లేదనే కారణంతో నిధులు వెనక్కి వెళ్లాయి. అప్పటి నుంచి ఇప్పటివరకు గ్రంథాయానికి శాశ్వత భవనం లేదు. దీంతో అనేక ఏళ్లుగా గ్రంథాలయ నిర్వహణ అద్దె భవనంలో కొనసాగాల్సి వస్తోంది. గ్రామంలో ప్రభుత్వ భూములున్నప్పటికీ ప్రజాప్రతినిధులు, నాయకులు పట్టించుకోక పోవడంతోనే నిధులు వెనక్కిపోవడం జరిగిందని యువకులు బాహాటంగా విమర్శిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రంథాయాలనికి శాశ్వత భవనం కోసం స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించాల్సిన సమయం ఆసన్నమైంది. కురవి గ్రామంలో ప్రభుత్వానికి సంబంధించిన స్థలాలు ఉండగా ఆ స్థలంలో భవనాన్ని నిర్మిస్తే స్థానిక విద్యావంతులకు జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు వీలవుతుందని పలువురు కోరుతున్నారు. యువకులు, విద్యావంతులు, విద్యార్థులు గ్రంథాలయం కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉంది.



అద్దె భవనంలో కొనసాగుతున్న కురవి గ్రంథాలయం

శాశ్వత భవనం నిర్మించాలి



కురవిలో శాఖ గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించాలి. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి భవనం కోసం నిధులు మంజూరు చేయాలి. గ్రంథాలయ నిర్మాణానికి నాయకులు చొరవచూపి పాఠకులకు, విద్యార్థులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలి.

– వీరేందర్, విద్యార్థి, కురవి

పేదల సొంతింటి కల నెరవేరుస్తా

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు /పెద్దవంగర : పేదల సొంతింటి కలను నెరవేరుస్తానని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో మంగళవారం మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, పెద్దవంగర మండల కేంద్రంలోని రైతువేదికలో పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లు అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పెద్దవంగరలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ.. ఇంత చిన్న వయసులోనే ఇందిరమ్మ ఇళ్లను పేదలకు అందించే అవకాశం కల్పించినందుకు నియోజకవర్గ ప్రజలకు, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ.. భావోద్వేగానికిలోనై కంటతడి పెట్టుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో తొర్రూరు పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఎంపీడీఓ పుల్లారావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, తొర్రూరు మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు డాక్టర్ పానుగోటి సోమేశ్వరరావు, సోమ రాజశేఖర్, చిత్తలూరి శ్రీనివాస్, అచ్చిరెడ్డి, పెద్దవంగర మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, నెమరుగొమ్ముల శైలారావు, నాయకులు పూర్ణచందర్, గోపాల్ నాయక్, రాజు యాదవ్, సీతారాం నాయక్, మురళి, రవీందర్ రెడ్డి, మెట్టు నగేష్, సైదులు, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



తొర్రూరు: లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే

తొర్రూరును స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. స్థానిక మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, ఇతర పనుల నిమిత్తం 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.88 లక్షలతో కొనుగోలు చేసిన స్వచ్ఛ ఆటోలు, వాటర్ ట్యాంకర్, ట్రాక్టర్లను మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ శాంతికుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, నాయకులు డాక్టర్ పానుగోటి సోమేశ్వరరావు, సురేందర్‌రెడ్డి, సోమ రాజశేఖర్, సురేష్, శంకర్, అనిల్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి



మరిపెడ రూరల్: రైతులకు వరి, పెసర విత్తనాల కిట్లు అందజేస్తున్న ఏడీఏ విజయ్‌చంద్ర



చిన్నగూడూరు: రైతువేదికలో రైతులకు విత్తనాలను అందజేస్తున్న ఏఓ భాస్కర్

- మరిపెడ ఏడీఏ విజయ్‌చంద్ర

మరిపెడ రూరల్/బయ్యారం/కొత్తగూడ/కురవి/చిన్నగూడూరు/గంగారం : నాణ్యమైన విత్తనాల సాగుతోనే అధిక దిగుబడి వస్తుందని మరిపెడ ఏడీఏ విజయచంద్ర రైతులకు సూచించారు. మంగళవారం మరిపెడ మండలం గిరిపురం రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలతో రైతుల సమావేశం నిర్వహించారు. అలాగే బయ్యారంలో వ్యవసాయ శాఖ కార్యాలయ ఆవరణంలో మల్యాల కేవీకే శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్, కొత్తగూడలో మండల వ్యవసాయాధికారి ఉదయ్, కురవిలో ఏఓ నరసింహారావు, చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి రైతువేదికలో మల్యాల శాస్త్రవేత్త ఎన్.కిషోర్ కుమార్ పలువురు రైతులకు వరి, పెసర విత్తనాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు ఎంచుకోవడంలో వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో కీటకవిభాగం శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న, మరిపెడ వ్యవసాయ అధికారి బోడ వీరసింగ్, ఏఈఓలు సైదమ్మ, శ్రీకాంత్, శ్వేత, రైతులు గండి వీరభద్రం, శ్రీనివాస్‌రెడ్డి, బాబునాయక్, వెంకన్న, కర్ణ, బయ్యారంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మధుకర్ రెడ్డి, ఏఓ రాంజీ, ఏఈఓలు, చిన్నగూడూరు మండల వ్యవసాయ అధికారి భాస్కర్, ఏఈఓలు సరిత, శిరీష, రైతులు తదితరులు పాల్గొన్నారు. అలాగే గంగారం మండలంలోని కోడిశెలమిట్ట గ్రామంలో ఏఓ వేణు యాదవ్ ఆధ్వర్యంలో రైతులకు వరి, జొన్న, కంది విత్తనాలను ఉచితంగా పంపిణీ చేయగా కాంగ్రెస్‌మండల అధ్యక్షుడు జాడి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

సమాజంపై అవగాహన ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్సై గిరిధర్‌రెడ్డి

గూడూరు : విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై అవగాహన ఉండాలని ఎస్సై గిరిధర్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాటిమీదిగూడెం పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయుడు డాక్టర్ వాంకుడోత్ గోపీనాథ్ క్షేత్ర ప్రదర్శనలో భాగంగా మంగళవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీసులంటే భయపడగా, వారితో ఎస్సై గిరిధర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ చేరుకొని వైద్యసేవలు, వైద్యుల పనితీరుపై అవగాహన కల్పించారు.

పిల్లల అక్రమ దత్తత చట్టరీత్యా నేరం

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్ : దత్తత పేరుతో పిల్లలను అమ్మడం, కొనడం చట్టరీత్యా నేరమని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. అక్రమ దత్తతపై ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పోస్టర్లు, కరపత్రాలను ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ చట్టవిరుద్ధంగా పిల్లలను పెంచుకోవడం నేరమని, దత్తత ఇచ్చిన, తీసుకున్నవారికి మూడేళ్ల శిక్షతో పాటు, లక్ష రూపాయల జరిమానా విధిస్తారని తెలిపారు. జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ జిల్లా పోలీసుల సహకారంతో అక్రమ దత్తతపై కరపత్రాలతో విస్తృత ప్రచారం నిర్వహిస్తామన్నారు. ప్రస్తుతం చట్టాలు సులభతరంగా మారాయని, క్రమ పద్ధతిలో దత్తత మార్గాన్ని సులభతరం చేసుకోవచ్చని, సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త స్వామి, డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, రిషికేష్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తదితరులు

భూసమస్యల పరిష్కారానికే సదస్సులు



డోర్నకల్: దరఖాస్తులను పరిశీలిస్తున్న మహబూబాబాద్ ఆర్డీఓ కృష్ణవేణి, అధికారులు



తొర్రూరు రూరల్ : గోపాలగిరిలో రైతుల భూ పత్రాలు పరిశీలిస్తున్న ఆర్డీఓ గణేష్

- మహబూబాబాద్, తొర్రూరు ఆర్డీఓలు కృష్ణవేణి, గణేశ్

డోర్నకల్/ చిన్నగూడూరు/గూడూరు/బయ్యారం /గార్ల /మరిపెడ రూరల్/ తొర్రూరు రూరల్ / పెద్దవంగర : భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మహబూబాబాద్ ,తొర్రూరు ఆర్డీఓలు కృష్ణవేణి, గణేశ్ తెలిపారు. మండలంలోని గుర్రాలకుంట, బూరుగుపాడు గ్రామాల్లో మంగళవారం ప్రారంభమైన రెవెన్యూ సదస్సులను ఆర్డీఓ కృష్ణవేణి సందర్శించి భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న రైతులతో మాట్లాడారు. చాలాకాలంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. చిన్నగూడూరు మండలంలోని విస్సంపల్లిలో ప్రారంభమైన రెవెన్యూ సదస్సును తహసీల్దార్ మహబూబ్ అలీ పరిశీలించారు. గూడూరు మండలం భూపతిపేట, ఊట్ల గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించగా భూపతిపేటలో తహసీల్దార్ నాగభవాని, ఊట్లలో నాయబ్ తహశీల్దార్ కోమల బృందం పాల్గొన్నారు. భూపతిపేటలో 129 దరఖాస్తులు, ఊట్లలో 24 దరఖాస్తులు వచ్చాయని నాగభవాని తెలిపారు. గార్ల మండలంలోని సేరిపురం, పెద్దకిష్టాపురం పంచాయతీల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో తహసీల్దార్ ఆర్.శారద పాల్గొని మాట్లాడారు. సేరిపురం పంచాయతీలో 153, పెద్దకిష్టాపురం పంచాయతీలో 28 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ వెల్లడించారు. బయ్యారం మండంలోని గురిమెళ్ల, వెంకటాపురం(మిర్యాలపెంట) గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి సదస్సులో 51 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. గురిమెళ్లలో 42, వెంకటాపురంలో 9 మంది రైతులు తమ భూసమస్యలను పరిష్కరించాలని అధికారులను కోరారు. అలాగే మరిపెడ మండలంలోని పురుషోత్తమాయగూడెం, బుర్హాన్‌పురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా రైతుల నుంచి తహసీల్దార్ కృష్ణవేణి దరఖాస్తులు స్వీకరించారు. తొర్రూరు మండలంలోని గోపాలగిరి, కొమ్మనపల్లి తండాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా స్థానికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. సాయంత్రం వరకు 67 దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ నర్సయ్య, ఆర్ఐ నజీముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు. తొర్రూరు మండలంలోని గోపాలగిరి, కొమ్మనపల్లి తండాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా ఆర్డీఓ గణేశ్ రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ నర్సయ్య, ఆర్ఐ నజీముద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు. పెద్దవంగర మండలంలోని పోచారంలో తహసీల్దార్ మహేందర్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆయా సదస్సులో డీటీలు, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



గూడూరు: భూపతిపేట సదస్సులో నాగభవాని



మరిపెడ రూరల్: పురుషోత్తమాయగూడెంలో..

వైభవంగా సుదర్శన చక్ర శోభాయాత్ర



మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ పట్టణంలోని శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వారి దేవాలయంలో సుదర్శన శిఖర చక్ర పునఃప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా సుదర్శన చక్ర శోభాయాత్ర మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులు,సుదర్శన చక్ర శోభాయాత్రను ప్రారంభించారు.

వీరన్న సన్నిధిలో అదనపు కలెక్టర్ పూజలు

కురవి : మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈఓ సత్యనారాయణ స్వాగతం పలికారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు.

పసుపు, మిరప సాగుపై అవగాహన

కేసముద్రం: మున్సిపల్ కేంద్రంలో పసుపు, మిరప పంటల సాగుపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి బి.మహేందర్, ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి కత్తుల నాగరాజు మాట్లాడారు. అనంతరం పసుపు, మిరప సాగుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్ : తొర్రూర్ డివిజన్ కేంద్రంలో ఈ నెల 8వ తేదీన జరుగనున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) జిల్లా మూడో మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న పిలుపునిచ్చారు. సంఘం మహబూబాబాద్ మండల మహాసభ కొమ్ము నారాయణ అధ్యక్షతన మంగళవారం సంఘ కార్యాలయంలో నిర్వహించగా ఆయన మాట్లాడారు.

కార్మిక హక్కుల సాధనకు దేశవ్యాప్త సమ్మె

దేశవ్యాప్తంగా జూలై 9వ తేదీన నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ పిలుపునిచ్చారు.

ఉత్తములుగా మన్ననలు పొందాలి

మహబూబాబాద్ రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ప్రజలకు మంచి సేవలు అందించి ఉత్తములుగా మన్ననలు పొందాలని మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అటవీ శాఖ అధికారులు విశాల్ బత్తుల, జి.కిష్టగౌడ్ అన్నారు. జిల్లా అటవీ శాఖ పరిధిలో పనిచేస్తున్న మరిపెడ ఎఫ్ఎస్ఓ రవీందర్, కోర్టు డ్యూటీ

సంక్షిప్త సమాచారం

అధికారి, ఎఫ్ఎస్ఓ మొగిలియ్య, డీఎఫ్ఓ డ్రైవర్ వలిపాషా పదవీవిరమణ మంగళవారం ఘనంగా నిర్వహించారు. వీరికి పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.

మెడికల్ కళాశాల హాస్టల్‌లో పాము కలకలం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల హాస్టల్ భవనంలో సోమవారం రాత్రి పాము కలకలం రేపింది. డీఎఫ్ఓ విశాల్ బత్తుల ఆదేశాల మేరకు బీట్ ఆఫీసర్ ఎల్.రవీందర్ హాస్టల్‌కు చేరుకుని స్నేక్ క్యాచర్ ద్వారా పామును పట్టి అడవిలో విడిచి పెట్టారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మెరిసిన మోహనశ్రీ

గూడూరు : మండలంలోని గాజులగట్టు శివారు సోమ్లా తండాకు చెందిన బోడ మోహనశ్రీ జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియా ఎస్టీ కేటగిరీలో 640 ర్యాంకు సాధించింది.

కవి సమ్మేళనంలో సతీష్‌కు పురస్కారం

దంతాలపల్లి : హైదరాబాద్‌లో నిర్వహించిన యువ కవి సమ్మేళనంలో మండలంలోని రామానుజపురం గ్రామానికి చెందిన కవి చిర్ర సతీష్ మంగళవారం సత్తా చాటారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని కవి సమ్మేళనం నిర్వహించారు.త్యాగాల తెలంగాణ అనే కవిత్వంలో తనకు పురస్కారం లభించినట్లు సతీష్ తెలిపారు.

రాజోలు విద్యార్థికి గోల్డ్‌మెడల్

కురవి : మండలంలోని రాజోలు గ్రామానికి చెందిన విద్యార్థిని బండి స్నేహగౌతమి 13వ జేఎన్‌టీయూ స్నాతకోత్సవంలో భాగంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంది.

జతిన్‌కు ప్రతిభా పురస్కారం

చిన్నగూడూరు : పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన మండల కేంద్రానికి చెందిన పత్తిపాక జతిన్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జతిన్‌కు ప్రతిభా పురస్కారం అందజేశారు.

దొడ్డురకం వరికి బోనస్ ఇవ్వాలి



బయ్యారం/కేసముద్రం/ గూడూరు : రైతులు పండిస్తున్న దొడ్డురకం వరికి సైతం బోనస్ ఇవ్వాలని ఏఐకేఎంఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. కేసముద్రం తహసీల్దార్ కార్యాలయంలో ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వివేక్‌కు ఆ సంఘం జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్, బట్టు నాగేశ్వర్ రావు, హనుమంతు, వెంకన్న, మదార్, లింగస్వామి వినతిపత్రాన్ని అందజేశారు. గూడూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు బండారు ఐలయ్య డిమాండ్ చేశారు.

చర్య తీసుకోవాలి

నెహ్రూసెంటర్ : ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కార్మికులకు సక్రమంగా వేతనాలు చెల్లించని సాయి ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్ మాదిగ పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రాన్ని అందజేసి, మాట్లాడారు.

మున్నేరు నిర్మాణానికి కృషి చేయాలి

గార్ల : మండలంలోని రైతులకు సాగునీరు అందించేందుకు మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ మంగళవారం ఖమ్మంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు.

నాసిరకం విత్తనాలు అరికట్టాలి

కురవి : నాసిరకం విత్తనాలు, ఎరువుల విక్రయాలను అరికట్టాలని అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు సామ పాపయ్య, నర్సయ్య, మాలోత్ వీరన్న, సుధాకర్, పద్మ, లచ్చమ్మ, గణేష్, వెంకన్న పాల్గొన్నారు.

పార్థసారథిరెడ్డి సేవలు మరువలేనివి

నెహ్రూసెంటర్ : సీపీఐ నేత, ప్రజానాయకుడు బి.పార్థసారథి రెడ్డి సేవలు మరువలేనివని సీపీఐ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. పార్థసారథి రెడ్డి వర్ధంతి సభను జిల్లా కేంద్రంలోని ఖన్నన్న కాలనీలో మంగళవారం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'దోస్త్' ప్రవేశాలు

మరిపెడ : మరిపెడలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దోస్త్ రెండో విడత అడ్మిషన్లు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ తెలిపారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు మరిపెడతో పాటు పరిసర గ్రామాల్లో పర్యటించి విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి కళాశాలలో ఉన్న వసతులు, గ్రూపులను ప్రచారం చేశారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు

మహబూబాబాద్: మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ టి.రాజేశ్వర్‌ను టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్‌తో పాటు ప లు సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

సన్మానం

గార్ల : మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన బానోత్ జుగల్‌కిషోర్ ఒడిశాలోని కటక్ జిల్లా ఎస్పీగా పనిచేస్తూ ఇటీవల డీఐజీగా పదోన్నతి పొందారు. మంగళవారం స్వగ్రామమైన అంజనాపురంలో డీఐజీని మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ శాలువాతో సత్కరించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



దంతాలపల్లి: ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



పెద్దవంగర: వడ్డెకొత్తపల్లి పాఠశాలలో..

దంతాలపల్లి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణు మాధవరెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణయ్య, అంతిరెడ్డి, రామయ్య, సుధాకర్, ప్రకాశ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

2007-08 విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పెద్దవంగర : మండలంలోని వడ్డెకొత్తపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో 2007-08లో పదో తరగతి చదివిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు.తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు కళాధర్, వీరన్న, వెంకట్ రెడ్డి, సాధిక్, శంకరయ్య, శార్వాణి పాల్గొన్నారు.

కుర్చీలే గొడుగులై..



కుర్చీలు ఎత్తుకొని నిల్చున్న ప్రజలు

కేసముద్రం : ఇనుగుర్తి మండల కేంద్రంలో మంగళవారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అనంతరం ఏర్పాటైన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతుండగా ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో టెంట్ కురుస్తుండటంతో స్టేజీపై ఉన్న నాయకులు తడవకుండా గొడుగులు పట్టుకోగా, సభకు హాజరైన ప్రజలు తాము తడవకుండా, వారు కూర్చున్న కుర్చీలనే గొడుగులుగా పట్టుకుని నిల్చున్నారు.